విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- మెట్లచిట్టాపూర్‌లో మహాత్మా జ్యోతిబా పూలే బాలికల, బాలుర గురుకుల పాఠశాలల సందర్శన

మారుతీనగర్, జూన్ 25: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. మెట్‌పల్లి పట్టణంలోని మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే బాలికల, బాలుర గురుకుల పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ తరగతుల నిర్వహణకు భవనం లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని ప్రిన్సిపాల్ ఆనందం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా త్వరలో సమకూర్చడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న గ్రంథాలయంతో పాటు గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

అంకితభావంతో విద్యాబోధన చేయాలి

మెట్‌పల్లి రూరల్, జూన్ 25: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు అంకితభావంతో విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. వెల్లుల్ల జడ్పీహెచ్ఎస్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేస్తున్న గుడ్లను పరిశీలించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం, జూన్ 25: కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సీడీపీ నిధులు రూ.7లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సాయిరెడ్డి, జడ్పీటీసీ కంఠం భారతి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు చిన్నారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి, నాయకులు జగన్‌రావు, కంఠం రమేశ్, మామిడి చిన్నారెడ్డి, నరేశ్, నర్సయ్య, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ సత్యప్రసాద్
- కోరుట్ల ప్రభుత్వ దవాఖాన తనిఖీ
- ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా
- వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలపై సమీక్ష

కోరుట్ల: పట్టణంలో వంద పడకల దవాఖాన భవనం నిర్మాణ పనుల గురించి ఏఈని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, జూన్ 25: ప్రభుత్వ దవాఖానలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. దవాఖానలో ప్రసూతి వార్డు, డయాలసిస్ సెంటర్, అత్యవసర విభాగాన్ని పరిశీలించారు. దవాఖానలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, డెలివరీల సంఖ్య, మందుల పంపిణీ, ఇన్ పేషెంట్ల వివరాలు తెలుసుకున్నారు. నిత్యం ఎంత మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, దవాఖాలో సిబ్బంది కొరత, ఔషధాల లభ్యతపై సమస్యలు ఉన్నాయా అని వాకాబు చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వంద పడకల దవాఖాన నూతన భవనాన్ని సందర్శించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, వైద్య పరికరాల అమరిక, వివిధ సేవా విభాగాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. అభివృద్ధి పనుల వివరాలు టీఎస్ఎంఐడీసీ ఏఈ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన ప్రకాశం రోడ్డు, ఝాన్సీరోడ్డులో కలెక్టర్ పర్యటించారు. వానకాలంలో ముంపునకు గురవుతున్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో సమీక్షించారు. స్థానిక మెట్‌పల్లి రోడ్డులోని కంచరకుంట చెరువును పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. వరదనీరు సాఫీగా వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, డీసీహెచ్ఎస్ సుదిష్ణదేవి, దవాఖాన సూపరింటెండెంట్ సునీతారాణి, మున్సిపల్ డీఈఈ అభినయ్, వైద్యులు శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

కోరుట్ల రూరల్, జూన్ 25: గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని మోహన్‌రావుపేట, పైడిమడుగు గ్రామ పంచాయతీలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, సర్వే తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హరితహారం మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. మాదాపూర్ శివారులోని విఘ్నేశ్వర రైస్ మిల్లులో రికార్డులను, సివిల్ సప్లయ్ గోదాంను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీవో సంపత్‌కుమార్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో నీరజ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్, తదితరులు

మల్లాపూర్, జూన్ 25: గ్రామాల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని శ్రీ వాసవీ మాత ఆలయ ఆవరణలో స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి దవాఖాన సహకారంతో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. లయన్స్‌క్లబ్ సేవలను గ్రామాల్లో విస్తృతంగా అందించాలని తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 84 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 61 మందిని కంటి శస్త్ర చికిత్స నిమిత్తం ప్రత్యేక బస్సులో రేకుర్తి కంటి దవాఖానకు తరలించినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు తోట రాజారాం, దేవ మల్లయ్య, కనుక సంజీవ్, స్వామి, రుద్ర రాంప్రసాద్, రాజేందర్, మార్గం రాజేశ్వర్, నాయకులు రాజరెడ్డి, చిన్నారెడ్డి, సురేశ్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, జైపాల్‌రెడ్డి, మైదాస్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు యావజ్జీవ శిక్ష

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 25: హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి నీలిమ మంగళవారం తీర్పు ఇచ్చారు. జగిత్యాల కోర్టు సీఎంఎస్ ఎస్ఐ రాజునాయక్, సీఎంఎస్ కానిస్టేబుల్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం వేంపెల్లి గ్రామానికి చెందిన దనరేకుల రాజేందర్ వ్యవసాయంతో పాటు ఈజీఎస్ మేట్‌గా పని చేసేవాడు. కాగా, తన భార్యతో రాజేందర్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అదే గ్రామానికి చెందిన జెల్ల రమేశ్ గొడవపడ్డాడు. ఈ క్రమంలో కోపం పెంచుకున్న రమేశ్ తన తమ్ముడు జెల్ల మహేశ్‌తో కలిసి 2020 మార్చి 30న రాజేందర్‌పై హత్యాయత్నం చేశారు. ఈ కేసులో అన్నదమ్ములిద్దరూ జైలుకు వెళ్లారు. రెండు నెలల తర్వాత బెయిల్‌పై వచ్చారు. కేసు రాజీ కోసం పెద్ద మనుషులతో మాట్లాడించినప్పటికీ రాజేందర్ రాజీకి ఒప్పుకోలేదు. దీంతో 2020 మే 19న రాజేందర్ బైక్‌పై వెళ్తుండగా అన్నదమ్ములిద్దరూ వెంబడించి వేంపేట్ శివారులోని అడ్డగించి కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాజేందర్ భార్య హరిణి ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మెట్‌పల్లి పోలీసులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, పీపీ మల్లికార్జున్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జెల్ల రమేశ్, జెల్ల మహేశ్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 5 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి నీలిమ తీర్పు ఇచ్చారు. కాగా, నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సీఎంఎస్ ఎస్ఐ రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్, కోర్టు కానిస్టేబుల్ రంజిత్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల, జూన్ 25: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఐఎఫ్‌టీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. బీజేపీ సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూమేశ్వర్, గంగాధర్, రహీం, కరీం, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కథలాపూర్, జూన్ 25: కథలాపూర్ మండలం సిరికొండ శివారులో రాయికల్ పట్టణానికి చెందిన షేక్ ఫిర్దోజ్(27) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్ పట్టణానికి చెందిన షేక్ ఫిర్దోజ్ కథలాపూర్‌లో అత్తగారింట్లో ఉంటూ బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. 15 రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఫిర్దోజ్ రాయికల్‌కు వెళ్లాడు. భార్య ఫిర్దాజ్‌ను కూడా రాయికల్‌కు రావాలని కోరగా నిరాకరించింది. ఈ విషయంలో ఫిర్దోజ్‌పై ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్దాజ్ ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో ఫిర్దోజ్ సోమవారం కథలాపూర్ రాగా భార్యతో పాటు మామ షేక్ అమీర్ గొడవ పడ్డారు. అక్కడి నుంచి ఫిర్దోజ్ వెళ్లిపోయాడు. కాగా, మంగళవారం సిరికొండ శివారులో మామిడితోటలో ఫిర్దోజ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని సీఐ సురేశ్‌బాబు పరిశీలించారు. ఫిర్దోజ్ తండ్రి షేక్ బాషుమియా ఫిర్యాదు మేరకు కేసు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

'రైతు భరోసా'పై అభిప్రాయాల సేకరణ

సారంగాపూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన ఏవోలు, ఏఈవోలు, రైతులు

సారంగాపూర్/మల్యాల/ఇబ్రహీంపట్నం/గొల్లపల్లి, జూన్ 25: జిల్లా వ్యాప్తంగా పలు రైతువేదికల్లో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు భరోసా అమలుపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పంటల సాగులో రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సారంగాపూర్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సారంగాపూర్, బీర్‌పూర్ ఏవోలు తిరుపతి నాయక్, అనూష, ఏఈవోలు వెంకటేశ్, ఆంజనేయులు, సందీప్, శిరీష, రాజేశ్, మత్తయి, శ్రీనివాస్, వరుణ్, సురేందర్ నాయక్, నరేందర్, ఆదర్శ రైతులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. మల్యాల రైతు వేదికలో జిల్లా వ్యవసాయాధికారి వాణి, వ్యవసాయాధికారులు చంద్రదీపక్, అనూష, వినీల, ఏఈవోలు, విత్తనాల డీలర్లు, రైతులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం రైతు వేదికలో మెట్‌పల్లి ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య, ఏవోలు దీపిక, యోగిత, నాగమణి, ఏఈవోలు రైతులు పాల్గొన్నారు. గొల్లపల్లిలో ఏవోలు, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు

కథలాపూర్, జూన్ 25: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బొడ్డు బాలు మంగళవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

కేసీఆర్‌తో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బాలు, పక్కన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నమస్తే తెలంగాణ CLASSIFIED
NAME CHANGE
★I SHAHEEN R/o H.No 1-2-149 Sha Sahab Street Karimnagar TS. Changed My Name As **SYEDA SHAHEEN W/o SYED ALEEMULLAH QUADRI**
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

పట్టణంలో నిరంతర గస్తీ నిర్వహించాలి

పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 25: పట్టణంలో శాంతి భద్రతల పటిష్ట అమలు, దొంగతనాల నివారణకు నిరంతరం గస్తీ నిర్వహించాలని ఎస్పీ అశోక్ కుమార్ పోలీసులను ఆదేశించారు. జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పలు విభాగాలు, పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి సంబంధిత ఘటనా స్థలాలకు వెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా వేగంగా స్పందించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్, జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, జూన్ 25: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు, గోవిందుపల్లి చౌరస్తా వరకు, కరీంనగర్ రోడ్డు ఏరియా, జితేందర్ పెట్రోల్ బంక్ ఏరియా, బాంబే షాపింగ్ మాల్ ఏరియా నుంచి గణేశ్ టెంపుల్ వరకు, నలంద డిగ్రీ కాలేజీ ఏరియా, గోవిందుపల్లి ఏరియా, వెంకటాద్రినగర్, దేవుని గోవిందుపల్లి ఏరియా, బస్‌డిపో ఏరియా, జడ్జీ బిల్డింగ్ వరకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, జంబిగద్దె ప్రాంతం, అశోక్‌నగర్, మోతే రోడ్, నాగేంద్రనగర్, చిలుకవాడ, గాయత్రీ బ్యాంక్ ఏరియా, మోచి బజార్, బుక్కవాడ ప్రాంతాలకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ సంతోష్ కుమార్ పేర్కొన్నారు.

ప్రతిభావంతురాలికి సత్కారం

మల్లాపూర్, జూన్ 25: మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన కుంచెపు గాయత్రి ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఆర్ట్స్ విభాగం)లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్ సాధించింది. గాయత్రిని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల సన్మానించి అభినందించారు. ఇక్కడ నాయకులు బైరి రవికుమార్, సుద్దు రాజ్‌కుమార్, మహేశ్, పల్లికొండ కార్తీక్, తదితరులున్నారు.

బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

మారుతీనగర్, జూన్ 25: రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే స్థానిక ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు శంకర్, ప్రతాప్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

కథలాపూర్, జూన్ 25: కథలాపూర్ మండలం దుంపేట, దూలూర్, బొమ్మెన గ్రామాల్లో నిల్వ ఉంచిన ఇసుక డంపులను మంగళవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ ముంతాజిబొద్దీన్ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జేఎన్టీయూ కళాశాలలో అవగాహన సదస్సు

కొడిమ్యాల, జూన్ 25: నాచుపల్లి జేఎన్టీయూలో మంగళవారం ఈఎంఎఫ్ (ఎలక్ట్రో మోటివేషన్ ఫోర్స్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. డీవోటీ శ్రావణ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ అరుణ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ రాఘవరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్వర్ ఫోన్ ద్వారా వచ్చే రేడియేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు ప్రోగ్రాం విధి విధానాలను ప్రిన్సిపాల్ ప్రభాకర్ విద్యార్థులకు వివరించారు.

బయో మైనింగ్ చెత్త ప్రాసెసింగ్ విధానం పరిశీలన

కోరుట్ల, జూన్ 25: పట్టణ శివారులోని డంప్ యార్డులో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ చెత్త ప్రాసెసింగ్ విధానాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ తిరుపతి పరిశీలించారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మహేశ్ ఉన్నారు.

ఇసుక వేలం

కోరుట్ల రూరల్, జూన్ 25: నాగులపేట గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన 400 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ఇటీవల రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను మంగళవారం వేలం వేయగా రూ. మూడు లక్షల 60 వేలు వచ్చినట్లు తహసీల్దార్ ఇట్యాల కిషన్ తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

గొల్లపల్లి, జూన్ 25: గొల్లపల్లి ఆదర్శ పాఠశాలలో ఎకోక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పర్యావరణహిత కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ తీసి, పాఠశాలలో పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి

జగిత్యాల, జూన్ 25: జిల్లా కేంద్రంలోని బుక్కవాడకు చెందిన మాజీ కౌన్సిలర్ బద్రి శ్రీరాములు (58) సోమవారం రాత్రి మృతి చెందారు. శ్రీరాములు మృతికి కళాశ్రీ అధినేత గుండేటి రాజు, బీజేపీ నాయకుడు ఏసీఎస్ రాజు, మాజీ కౌన్సిలర్ గాజుల నగేశ్, పాత్రికేయులు అలిశెట్టి మదన్ మోహన్, సిరిసిల్ల వేణుగోపాల్, కందుకూరి నాగరాజు, అడ్వకేట్ బుసారపు శ్రీనివాస్, రాజు, వీరబత్తిని అనిల్ కుమార్, ఆముద రాజు, చింత అనిల్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జయపాల్ తదితరులు సంతాపం తెలిపారు.

లైంగికి దాడి కేసులో నిందితుడి అరెస్టు

రాయికల్, జూన్ 25: రాయికల్ పట్టణంలో రెండు రోజుల క్రితం బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సింగు గంగనర్సయ్యను మంగళవారం అరెస్టు చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అవగాహన సదస్సుకు న్యాయవాదుల హాజరు

కోరుట్ల, జూన్ 25: హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర అకాడమీ, రాష్ట్ర బార్ కౌన్సిల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సుకు కోరుట్ల కోర్టు నుంచి న్యాయవాదులు కడకుంట్ల సదాశివరాజు, గోనె సదానందం నేత, కటుకం రాజేంద్రప్రసాద్, ఆడెపు వినోద్, మద్దుల రోజు హాజరయ్యారు. నూతన చట్టాలపై హైకోర్టు న్యాయమూర్తి విజయసాయిరెడ్డి అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

సారంగాపూర్, జూన్ 25: బీర్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన పది మంది బాలురు, పది మంది బాలికలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈవో భీమయ్య పేర్కొన్నారు.

డీఎస్పీ విచారణ

మెట్‌పల్లి, జూన్ 25: రెండు రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి మంగళవారం పట్టణంలోని దుబ్బవాడలో డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు విచారణ జరిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... దుబ్బవాడకు చెందిన కుంబాల గణేశ్‌కు అతని సోదరుడికి మధ్య ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో వారసత్వంగా రావాల్సిన భూమికి సంబంధించి వివాదం జరుగుతున్నది. ఈ క్రమంలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఎండీ హకీం ఉరఫ్ అక్రం, నరేశ్, సద్దాం, మనోజ్‌తో పాటు జగిత్యాల మున్సిపాలిటీలో పనిచేసే మారుతి కలిసి గణేశ్‌కు రావాల్సిన సగ భాగం భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తామని, తమకు ప్రభుత్వ అధికారులు తెలుసు అని నమ్మించారు. అందుకు రూ. 20 లక్షలు డబ్బులు అవుతాయని, మొదటగా రూ. 12 లక్షలు, తర్వాత మిగతా డబ్బులు ఇవ్వాలని చెప్పారు. అందుకు ఒప్పుకొని గణేశ్ రూ. 12 లక్షలు ఇచ్చాడు. నెలలు గడుస్తున్నా భూసమస్యను పరిష్కరించకపోవడంతో గణేశ్ తన భార్యతో కలిసి వెళ్లి డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగగా కులం పేరుతో దూషించి, బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై అట్రాసిటీ, చీటింగ్ కేసు నమోదు చేశారు. అట్రాసిటి కేసుకు సంబంధించి ఘటన స్థలానికి డీఎస్పీ వెళ్లి వివరాలను సేకరించారు. ఆయన వెంట ఎస్ఐ చిరంజీవి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోరుట్ల, జూన్ 25: తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి గంగుల నరేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఈనెల 27న ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1, 2015 నుంచి ఆగస్టు 31, 2016 మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 3వ తరగతి మార్కుల జాబితా, బోనఫైడ్ సర్టిఫికెట్, 3 ఫొటోలతో పీడీలు అశోక్ 99487 65002, విజయ్‌కుమార్ 99515 16737లో సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్‌కు వినతి

కొడిమ్యాల, జూన్ 25: తిర్మలాపూర్ అనుబంధ గ్రామం సంద్రల్లపల్లిలోని కస్తూర్బా పక్కన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని మంగళవారం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.హద్దులు ఏర్పాటు చేసి, పరిరక్షించాలని వినతి పత్రంలో కోరారు.

బీఆర్ఎస్ శ్రేణులతో మమేకమైన ఎమ్మెల్యే

బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల పట్టణంలోని గంగారాం మెస్‌లో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఓ సామాన్యుడిలా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి భోజనం చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మెట్‌పల్లి చేరుకున్న ఆయన ఎంపీపీ సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎలాల దశరథరెడ్డి, తదితర నాయకులతో కలిసి మెస్‌లో భోజనం చేశారు. **–మెట్‌పల్లి, జూన్ 25**

అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

మల్యాల, జూన్ 25: కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. దొంగలమర్రి నుంచి కొండగట్టు ఆలయం వరకు మూడు కిలోమీటర్ల మేర భక్తుల వాహనాలతో ట్రాఫిక్ జామ్ కాగా, స్వామి వారి దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. ఆలయ ఈవో ఆకునూరి చంద్రశేఖర్ భక్తుల రద్దీని బట్టి ఆలయ సిబ్బందికి సమాచారం చేరవేయడంతో ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. స్వామి వారిని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారని, ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.12 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కార్యక్రమంలో ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ, చంద్రశేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సంపత్, లక్ష్మారెడ్డి, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సత్కారం

ధర్మపురి, జూన్ 25: అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ చిట్టిబాబు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎంపీడీవో రవీందర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులను సన్మానించారు. జడ్పీటీసీ బత్తిని అరుణ, అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడి మృతి

కోరుట్ల రూరల్, జూన్ 25: మండలంలోని మాదాపూర్–పైడిమడుగు గ్రామాల మధ్య సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మాదాపూర్ గ్రామానికి చెందిన పత్రి ప్రశాంత్(28) ద్విచక్రవాహనంపై పైడిమడుగుకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రశాంత్ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.